కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -270 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 10-10-2026 శనివారం పేజీలు : 4



# భూమికి భగభగలు

# ఎల్‌నినో సెగలు!

- ప్రపంచానికి ఎల్ నినో సెగలు!
- 1950 తర్వాత ఇదే అత్యంత తీవ్రతా?
- భూమంతా ఎరుపు రంగులోకి..
- వణికిస్తున్న 'సూపర్ డూపర్' ఎల్ నినో
- చలికాలంలోనూ మండే ఎండలు?
- ఒకచోట కరువు.. మరోచోట వరద!
- పసిఫిక్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ప్రపంచ వాతావరణానికి పెను సవాల్
- ఎల్ నినో ఎఫెక్ట్‌తో మారనున్న వాతావరణం!

**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** ప్రపంచాన్ని "ఎల్ నినో" వణికిస్తోంది. ప్రపంచ వాతావరణంపై ఎల్ నినో తన పంజా విసిరేందుకు సిద్ధమైందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది ఏర్పడిన ఎల్ నినో 1950 తర్వాత నమోదైన అత్యంత బలమైన వాతావరణ దృగ్విషయంగా మారే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ "ప్రపంచ వాతావరణ సంస్థ" హెచ్చరించింది. ఎల్ నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశ ఉంది. పసిఫిక్ మహాసముద్రంలోని భారీ ఉష్ణశక్తి వాతావరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.

మిగతాది 2 లో..

# ఢిల్లీ మెట్రోపై పూర్తి నిషేధానికి నో



**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** అక్టోబర్ 10న జరగనున్న భారీ నిరసన ప్రదర్శనల నేపథ్యంలో ఢిల్లీ మెట్రో రాకపోకలపై అధికారులు విధించిన కఠిన ఆంక్షలపై అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకుంది. నిరసనలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైళ్ల రాకపోకలపై ఎలాంటి 'పూర్తి నిషేధం' విధించరాదని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణ పౌరుల రోజువారీ ప్రయాణాలకు ఎలాంటి తీవ్ర అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని ధర్మాసనం గుర్తుచేసింది.

# భగీరథ్‌కు హైకోర్టు ఊరట!

- మీడియా ప్రచారంపై మధ్యంతర ఆంక్షలు
- వార్తలు, వీడియోల ప్రసారానికి బ్రేక్
- కేంద్రం, రాష్ట్రానికి కోర్టు నోటీసులు
- ఏఐ మార్ఫింగ్ చిత్రాలపై అభ్యంతరం
- గూగుల్, మెటా, ఎక్స్‌కు ఆదేశాలు
- కౌంటర్ అఫిడవిట్ల దాఖలుకు ఆదేశం



**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు వివరాలకు సంబంధించి ఎలాంటి వార్తలు, కథనాలు, వీడియోలు ప్రసారం చేయకూడదని, షేర్ చేయకూడదని టీవీ ఛానళ్లు, డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఆదేశిస్తూ మధ్యంతర ఆంక్షలు విధించింది. భగీరథ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై స్పందిస్తూ కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

**అసలేం జరిగిందంటే..**

పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతుండగానే, మీడియాలో తనపై జరుగుతున్న ఉద్దేశపూర్వక దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు.

# నవంబర్ 3 వరకు నో వార్!



**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** నవంబర్ 3 వరకు ఇరాన్ పై దాడులు ఉండవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికల దృష్ట్యా దాడులకు తాత్కాలిక బ్రేక్ పడిందని చెప్పారు.

# ఓటు హక్కును కాలరాయొద్దు




- సర్ అక్రమాలపై కేటీఆర్ ఫైర్
- సుప్రీంకోర్టు సుమోటో విచారణకు డిమాండ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి
- రాజ్యాంగమే అత్యున్నతమన్న కేటీఆర్
- 140 కోట్ల ప్రజల హక్కులపై ప్రశ్న
- సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు

2 లో

# స్థానిక ఎన్నికలకు సుప్రీం గ్రీన్ సిగ్నల్!



- వైసీపీ పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- ఏపీ స్థానిక ఎన్నికలకు తొలగిన అడ్డంకులు
- పాత జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టీకరణ
- ఎస్ఐఆర్ పూర్తయ్యాకే ఎన్నికలన్న వైసీపీ వాదనకు చుక్కెదురు
- వార్డుల పునర్విభజనతో ఎన్నికల ఆలస్యంపై కోర్టు వ్యాఖ్యలు
- సకాలంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం

# బీసీలకు టీడీపీ భరోసా!

- బీసీలకు 34 శాతం సీట్లు ఖాయం
- పార్టీ పరంగా రిజర్వేషన్ల అమలు
- కోర్టుల్లో ఎదురుదెబ్బ.. వెనక్కి తగ్గం
- బీసీల రాజకీయ సాధికారతే లక్ష్యం
- రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేశారంటూ విమర్శ
- 16,800 మంది బీసీ నేతలకు పదవీ నష్టం
- కులవృత్తులకు అండగా సంక్షేమ పథకాలు



**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడమే తమ ప్రభుత్వ విధానమని, చట్టపరమైన అడ్డంకులు ఎదురైనా పార్టీ పరంగా 34 శాతానికి తగ్గకుండా బీసీలకు సీట్లు కేటాయించి తీరుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారతపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక విషయాలను వెల్లడించారు.

**34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం..**

"బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణంగా కట్టుబడి ఉంది. గత వైకాపా ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని, నష్టాన్ని భర్తీ చేసేందుకు తమ ప్రభుత్వం రాగానే జీవో 105, జీవో 1065లను తీసుకువచ్చింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలపై 'గొడ్డలి పార్టీ' (వైసీపీ) నేతలు కుట్రపూరితంగా హైకోర్టుకు వెళ్లారు. వైసీపీ కోర్టును ఆశ్రయించడం వల్లే హైకోర్టులో ఆ జీవోలు కొట్టివేతకు గురయ్యాయి. హైకోర్టు తీర్పు వచ్చినా తాము వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టును ఆశ్రయించాం.

# హరీశ్ పరువు నష్టం కేసులో కీలక మలుపు!

- కాంగ్రెస్ నేతలకు కోర్టు సమన్లు
- మహేష్ గౌడ్, అద్దంకికి ఆదేశాలు
- అక్టోబర్ 29న వ్యక్తిగత హాజరు
- క్షుద్ర పూజలంటూ కాంగ్రెస్ ఆరోపణలు
- క్షమాపణ చెప్పాలంటూ లీగల్ నోటీసులు
- స్పందన లేక కోర్టును ఆశ్రయించిన హరీశ్
- ఆధారాలు పరిశీలించి విచారణకు స్వీకరణ

2 లో

# గ్రీన్‌కార్డ్ ప్రక్రియకు బ్రేక్

- భారత ఐటీ ఉద్యోగులకు అమెరికా షాక్
- ప్రముఖ ఐటీ దిగ్గజాలపై సస్పెన్షన్
- ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రోకు దెబ్బ
- మైక్రోసాఫ్ట్, అడోబ్‌పైనా ఆంక్షలు
- అమెరికన్ల ఉద్యోగాల కోసమేనన్న ట్రంప్ సర్కార్
- కొత్త దరఖాస్తులకు స్వీకరణ బంద్
- హెచ్-1బీ భారతీయుల్లో పెరిగిన ఆందోళన




**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** అమెరికాలో విదేశీ కార్మికులకు, ముఖ్యంగా హెచ్-1బీ వీసాదారులకు ట్రంప్ సర్కార్ ఊహించని షాకిచ్చింది. ఎంప్లాయ్‌మెంట్ ఆధారిత గ్రీన్ కార్డులను పొందే ప్రక్రియలో కీలకమైన "పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్" నుండి పలు ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలను గురువారం సస్పెండ్ చేసింది. ఈ సస్పెన్షన్ పరిధిలోకి కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా (టిసిఎస్), విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమిని వంటి ప్రముఖ అవుట్‌సోర్సింగ్ కంపెనీలతో పాటు మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి దిగ్గజ టెక్ సంస్థలు కూడా వచ్చాయి.

ఈ విదేశీ వీసా ప్రోగ్రామ్‌లను సదరు కంపెనీలు దుర్వినియోగం చేస్తూ, అమెరికన్ కార్మికుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తున్నాయని యూఎస్ లేబర్ సెక్రటరీ కీత్ సోండర్లింగ్ ఆరోపించారు.

# హుస్సేన్ సాగర్‌లో బిడ్డను విసిరేసిన తల్లి!

- వైద్యం చేయించలేని ఆర్థిక ఇబ్బందులు
- భర్త వదిలేయడంతో ఒంటరి పోరాటం
- పేగు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న బాలిక
- సమయానికి స్పందించిన ఆటో డ్రైవర్
- నీటిలోకి దూకి చిన్నారి ప్రాణాలు కాపాడిన వైనం
- గాంధీ ఆసుపత్రిలో బాలికకు చికిత్స
- ఆటో డ్రైవర్ మానవత్వంపై ప్రశంసలు

2 లో

# మోడీ పేరుతో నోయిడా ఎయిర్‌పోర్ట్!

- యూపీ కేబినెట్ కీలక నిర్ణయం
- ప్రతిపాదనకు యోగి సర్కార్ ఆమోదం
- నరేంద్ర మోదీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా
- లక్నోలో అధికారిక ప్రకటన
- విమానాశ్రయానికి కొత్త పేరు ఖరారు
- యోగి కేబినెట్ నిర్ణయంపై ఆసక్తి

2 లో

# హరీశ్ పరువు నష్టం కేసులో కీలక మలుపు!



**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం దావా కేసులో నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్లకు సమన్లు పంపింది. ఈ ఏడాది అక్టోబర్ 29న తమ ఎదుట వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

ఇటీవల హరీశ్ రావు తన కుటుంబ సమేతంగా కర్ణాటకలోని కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న సందర్భంలో, తెలంగాణలో వర్షాలు పడకుండా నిరోధించేందుకు ఆయన 'క్షుద్ర పూజలు/చేతబడులు' చేశారంటూ కాంగ్రెస్ నేతలు మహేష్ కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్లు తీవ్ర ఆరోపణలు చేశారు. గాంధీ భవన్ వేదికగా చేసిన ఈ వ్యాఖ్యలు తన వ్యక్తిగత ప్రతిష్టను, ఆధ్యాత్మిక నమ్మకాలను దెబ్బతీసేలా ఉన్నాయని హరీశ్ రావు మండిపడ్డారు. దీనిపై బహిరంగ క్షమాపణ చెప్పాలని లీగల్ నోటీసులు పంపినప్పటికీ స్పందన రాకపోవడంతో, ఆయన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించి పరువు నష్టం దావా వేశారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడిన వీడియో క్లిప్పింగ్స్, వార్తాపత్రిక ఆధారాలను హరీశ్ రావు న్యాయస్థానానికి సమర్పించగా, ఇటీవల ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న ప్రత్యేక కోర్టు.. తాజాగా పిటిషన్ను విచారణకు స్వీకరించి కాంగ్రెస్ నేతలకు సమన్లు జారీ చేసింది.

# బీసీలకు టీడీపీ భరోసా!

మొదటి పేజీ తరువాయి

బీసీ మంత్రులు స్వయంగా ఢిల్లీ వెళ్లేలా చేసి, అగ్రశ్రేణి సీనియర్ అడ్వకేట్లను నియమించి న్యాయ నిపుణులతో చర్చలు జరిపాం. అయితే, దురదృష్టవశాత్తూ సుప్రీంకోర్టు కూడా 34 శాతం రిజర్వేషన్లను అనుమతించలేదు." అని సీఎం పేర్కొన్నారు.

పార్టీ పరంగా 34% సీట్లు ఇస్తాం:

కోర్టుల్లో ఎదురుదెబ్బ తగిలినా బీసీల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. చట్టపరంగా 34 శాతం ఇవ్వలేకపోయినా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 34 శాతానికి తగ్గకుండా సీట్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. బీసీల రాజకీయ గౌరవాన్ని కాపాడటం, స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంచడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలుగుదేశం ఎప్పుడూ బీసీల పక్షమేనని పునరుద్ఘాటించారు. బీసీలకు రాజ్యాధికారం, రాజకీయ అవకాశాలు కల్పించింది మొదటగా తెలుగుదేశం పార్టీయేనని గుర్తు చేశారు. పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు హయాంలోనే 4 దశాబ్దాల క్రితం బీసీ గళం, స్వరం గట్టిగా వినిపించిందని తెలిపారు. ఆ తర్వాత 1995లో స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లను 34 శాతానికి పెంచింది కూడా తమ ప్రభుత్వమేనన్నారు.

బీసీలను అణగదొక్కింది..

టీడీపీకి ఎప్పుడూ అండగా ఉంటారనే అక్కసుతో గత వైసీపీ ప్రభుత్వం బీసీలను తీవ్రంగా అణగదొక్కిందని సీఎం దుయ్యబట్టారు. 30 ఏళ్లుగా అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్లను కక్షతో 24 శాతానికి తగ్గించడంతో 16,800 మంది బీసీ నాయకులు తమ పదవులను కోల్పోయారని తెలిపారు. నాటి హైకోర్టు తీర్పుల సమయంలో అధికారంలో ఉన్న వైసీపీ కనీస ప్రయత్నం కూడా చేయకుండా బీసీల హక్కులను కాలరాసిందన్నారు. బీసీల ఆదరణ కోసం ఫెడరేషన్లకు నాంది పలికింది టీడీపీయేనన్నారు. కులవృత్తులు, చేతివృత్తుల జీవనోపాధిని కాపాడేందుకు 'ఆదరణ' పథకం కింద 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించిన ఘనత తమదేనని కూడా సీఎం పేర్కొన్నారు.

వడ్డెరలకు 10 శాతం మైనింగ్ లీజులు, గీత కార్మికులకు 10 శాతం ఎక్సైజ్ షాపులు కేటాయించామని సీఎం తెలిపారు. 'నేతన్న సేవలో' పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.25,000 ఆర్థిక సాయం అందిస్తున్నాం. హ్యాండ్లూమ్ మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం అందించే పథకాన్ని గతంలో తానే తీసుకువచ్చానని, ఇప్పుడు దాన్ని 'మత్స్యకారుల సేవలో' కింద రూ.20,000కు పెంచామని తెలిపారు. సబ్సిడీపై బోట్లు, డీజిల్ ఇస్తూ తీరప్రాంత వేట హక్కులను రక్షిస్తున్నాం. గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద జీవో నెంబర్ 217ను రద్దు చేసి మత్స్యకార సొసైటీల హక్కులను కాపాడాం. మత్స్యకార మహిళలకు సీ-వీడ్ పెంపకంపై శిక్షణనిచ్చి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల భృతిని రూ.15,000 నుండి రూ.25,000కు పెంచాం. స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. బీసీల రాజకీయ ఎదుగుదలకు, హక్కుల రక్షణకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కొండంత అండగా ఉంటుందని, చట్టపరంగా సాధ్యం కాకపోయినా రాజకీయంగా 34 శాతం లబ్ధిని ప్రత్యక్షంగా అమలు చేసి చూపుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఢిల్లీ మెట్రోపై పూర్తి నిషేధానికి నో

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో మెట్రో తో పాటు ఇతర రైల్వే సర్వీసులను పూర్తిగా నిలిపివేయకుండా, ప్రామాణిక నిబంధనలకు లోబడి నియంత్రిత పద్ధతిలో నడపడానికి గల అవకాశాలను పునఃపరిశీలించాలని సంబంధిత అధికార వర్గాలను ఆదేశించింది. ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ సైతం ఈ విషయాన్ని పరిశీలించి, ఢిల్లీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్ణయం తీసుకునేలా అధికారులతో చర్చిస్తామని న్యాయస్థానానికి హామీ ఇచ్చారు.

రవాణా ఆంక్షలు, బారికేడ్ల ఏర్పాటు, ప్రత్యామ్నాయ మార్గాలపై సాధారణ ప్రయాణికులు అయోమయానికి గురి కాకుండా అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సవరించిన నిబంధనలు, ప్రయాణ సూచనలను వార్తాపత్రికలు, అధికారిక వెబ్సైట్లు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలని పేర్కొంది. ప్రస్తుత విచారణ సాధారణ పౌరుల రాకపోకలు, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ సదుపాయాలకు సంబంధించిన అంశాలకే పరిమితమని స్పష్టం చేస్తూ.. నిరసన తెలిపే ప్రాథమిక హక్కు, నిరసనకారులపై విధించిన ఆంక్షలకు సంబంధించి ఏదైనా అభ్యంతరం ఉంటే నిర్వాహకులు ప్రత్యేకంగా అత్యవసర పిటిషన్ దాఖలు చేయవచ్చని న్యాయస్థానం సూచించింది.

# గ్రీన్‌కార్డ్ ప్రక్రియకు బ్రేక్

మొదటి పేజీ తరువాయి




వైస్ ప్రెసిడెంట్ జేడీ వ్యాన్స్, యూఎస్ యాంటీ ఫ్రాడ్ టాస్క్ ఫోర్స్ చీఫ్‌లతో కలిసి ఆయన ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. బాధ్యతాయుతమైన ఈ కంపెనీలకు సంబంధించిన కొత్త PERM దరఖాస్తులను స్వీకరించబోమని, అలాగే ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా ప్రాసెస్ చేయబోమని సోండర్లింగ్ స్పష్టం చేశారు. 2009 నుండి ఈ కంపెనీలు లక్షలాది విదేశీ కార్మికుల కోసం దరఖాస్తు చేసుకున్నాయని, దీనివల్ల అమెరికన్లకు దక్కాల్సిన వేలాది ఉద్యోగాలు చేజారిపోయాయని ఆయన పేర్కొన్నారు.

అమెరికాలోని భారతీయ ఐటీ నిపుణులపై, ముఖ్యంగా గ్రీన్ కార్డ్ నిరీక్షణలో ఉన్న హెచ్-1బీ వీసాదారులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది. విదేశీ నైపుణ్య వీసాలను పొందుతున్న వారిలో దాదాపు ముప్పావు వంతు మంది భారతీయులే ఉండటం, అందులోనూ ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో వంటి భారతీయ ఐటీ దిగ్గజాల్లో అత్యధికులు పనిచేస్తుండటంతో ఈ తాజా చర్య భారతీయ ఐటీ రంగాన్ని, ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# ఓటు హక్కును కాలరాయొద్దు




**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** దేశంలో సంచలనం సృష్టిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (సర్) ప్రక్రియలోని జరుగుతున్న అక్రమాలపై బీఆర్ఎస్ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్వీ2తప్పుకోవాల్సిందే!' అంటూ కేటీఆర్ తన పోస్టులో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఒక్క వ్యక్తినీ కాపాడుకోవడానికి ఎందుకు ఇంత ఆరాటం? అని ప్రశ్నించిన ఆయన.. 140 కోట్ల మంది భారతీయుల హక్కుల కంటే ఏ ఒక్క వ్యక్తి గొప్పవారు కరారంటూ నిలదీశారు. దేశం ఎంతోమంది వ్యక్తులను చూసింది, ఎంతో మంది వచ్చారు, వెళ్లారు.. కానీ ఈ దేశం ఎప్పుడూ బలంగా, అందంగా నిలబడిందని పేర్కొన్నారు. దేశ ఆత్మను దెబ్బతీసేలా ప్రత్యామ్నాయ వ్యవస్థలను సృష్టించడానికి ప్రయత్నిస్తున్న ఎవరికైనా సమయం ముగిసింది' అని హెచ్చరించారు.

సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి..

ఎస్ఐఆర్ ప్రక్రియలో చోటుచేసుకున్న తీవ్రమైన అక్రమాలపై సుప్రీంకోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సిట్టింగ్ సుప్రీంకోర్టు జడ్జి ఆధ్వర్యంలో ఈ పూర్తి ప్రక్రియపై ఓ స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును కాలరాసే కుట్రలపై సమగ్ర విచారణ జరగాలని అని కేటీఆర్ అన్నారు

# భగీరథ్‌కు హైకోర్టు ఊరట!

మొదటి పేజీ తరువాయి

ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో బీఎన్ఎస్, పోక్సో చట్టాల కింద తనపై కేసు నమోదైందని, అయితే దర్యాప్తు సమయంలో పోక్సో సెక్షన్లను మార్చారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో జూన్ 19న తనకు మధ్యంతర బెయిల్, జులై 9న రెగ్యులర్ బెయిల్ మంజూరైందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

కోర్టు బెయిల్ ఇచ్చినా, కేసు దర్యాప్తు ఇంకా పూర్తి కాకపోయినా.. కొన్ని టీవీ ఛానళ్లు, ప్రింట్, సోషల్ మీడియా మాధ్యమాల్లో తనను అప్పటికే దోషిగా చిత్రీకరిస్తూ తీవ్రమైన ప్రచారం చేస్తున్నారని భగీరథ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిరాధారమైన ఆరోపణలతో తనను రేపిస్ట్, నేరస్థుడు అని ముద్రవేస్తూ పోస్టులు పెడుతున్నారని కోర్టుకు విన్నవించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ సాయంతో తనను రావణాసురుడిగా మార్ఫింగ్ చేసిన చిత్రాలను సృష్టించి విస్తృతంగా వైరల్ చేస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా, ఈ ప్రచారం తన తండ్రి బండి సంజయ్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సాగుతోందని పేర్కొన్నారు. విస్మయకరమైన విషయమేమిటంటే.. తనకు బెయిల్ మంజూరు చేసిన న్యాయమూర్తిని, ఈ కేసుతో సంబంధం ఉన్న న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సైతం వదలకుండా సోషల్ మీడియాలో టార్గెట్ చేస్తూ ప్రచారం చేస్తున్నారని పిటిషన్‌లో వివరించారు.

**గూగుల్, మెటా లకు కోర్టు ఆదేశాలు..**

ఈ తప్పుడు ప్రచారాలకు తక్షణమే అడ్డుకట్ట వేయాలని కోరుతూ భగీరథ్.. గూగుల్, మెటా, ఎక్స్ కార్ప్ , యూట్యూబ్ సంస్థలతో పాటు పలు టీవీ న్యూస్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలను ప్రతివాదులుగా చేర్చారు. అలాగే కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఐటీ మంత్రిత్వ శాఖ, తెలంగాణ డీజీపీలను కూడా ఈ పిటిషన్‌లో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

**పిటిషనర్ వాదనలు విన్న హైకోర్టు..**

దర్యాప్తు పూర్తి కాకుండానే ఇలా ముందస్తు తీర్పులు ఇస్తూ ఒక వ్యక్తి పరువుకు, దర్యాప్తు ప్రక్రియకు భంగం కలిగించేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ కేసుకు సంబంధించి ఎలాంటి కంటెంట్‌ను ప్రచురించడం, ప్రసారం చేయడం, రీపోస్ట్ చేయడం లేదా ఫార్వార్డ్ చేయడం వంటివి చేయవద్దని బ్రాడ్‌కాస్టర్లను, మీడియా సంస్థలను, సోషల్ మీడియా యూజర్లను ఆదేశిస్తూ ఆంక్షలు విధించింది. అలాగే, ఈ వ్యవహారంపై వాస్తవ వివరాలతో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# మోడీ పేరుతో నోయిడా ఎయిర్‌పోర్ట్!




**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో నిర్మితమవుతున్న జెవర్ విమానాశ్రయం పేరును మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విమానాశ్రయానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ పేరును పెట్టాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. లక్నోలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం లభించినట్లుగా అధికారికంగా ప్రకటించారు. జెవర్ విమానాశ్రయాన్ని ఇకపై అధికారికంగా నరేంద్ర మోడీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ గా పిలవనున్నట్లుగా వెల్లడించారు. రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపు, వారసత్వ సంపదను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా సీఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు.

# హుస్సేన్ సాగర్‌లో బిడ్డను విసిరేసిన తల్లి!



**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** పేదరికం.. ఆర్థిక ఇబ్బందులు.. కూతురి అనారోగ్యానికి వైద్యం చేయించలేని నిస్సహాయత.. ఇవన్నీ ఓ తల్లిని తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశాయి. చివరకు ఆ బాధలో ఆరేళ్ల చిన్నారిని హుస్సేన్ సాగర్‌లోకి విసిరేసిన ఘటన కలకలం రేపింది. అయితే, అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ ఆటో డ్రైవర్ మానవత్వంతో స్పందించి, వెంటనే నీటిలోకి దూకి చిన్నారి ప్రాణాలను కాపాడాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయినపల్లిలోని హస్మత్‌పేట్‌కు చెందిన షబానా తన భర్త వదిలేయడంతో ఇద్దరు కూతుళ్లను ఒంటరిగా పోషిస్తోంది. ఇళ్లల్లో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. చాలీచాలని ఆదాయంతో ఇద్దరు పిల్లలను పెంచుతూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆమె రెండో కూతురు రుక్సానా (6) పేగు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతోంది. చిన్నారికి వైద్యం చేయించేందుకు అవసరమైన డబ్బులు లేక షబానా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

కూతురి అనారోగ్యానికి చికిత్స చేయించే స్తోమత లేకపోవడంతో షబానా తీవ్ర నిస్సహాయతకు గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రుక్సానాను హుస్సేన్ సాగర్‌లోకి విసిరేసింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ ఆటో డ్రైవర్ ఈ ఘటనను గమనించాడు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే నీటిలోకి దూకి చిన్నారిని రక్షించాడు. సకాలంలో స్పందించడంతో రుక్సానా ప్రాణాలతో బయటపడింది. ఘటన అనంతరం చిన్నారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రుక్సానా అక్కడ చికిత్స పొందుతోంది. కూతురి ప్రాణాలకు ముప్పు కలిగించేలా తల్లి తీసుకున్న నిర్ణయం ఆందోళన కలిగిస్తుండగా, ప్రమాదాన్ని గమనించిన వెంటనే స్పందించి చిన్నారిని కాపాడిన ఆటో డ్రైవర్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# నవంబర్ 3 వరకు నో వార్!

మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌తో నిర్మాణాత్మక చర్చలు జరుపుతున్నామని, ఆ దేశం వద్ద అణ్వాయుధాలు ఉండకూడదని అన్నారు. తీవ్రమైన సైనిక, ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఇరాన్ చర్చల ద్వారా ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల వరకు సైనికచర్యలకు బ్రేక్ ఇస్తున్నట్టు స్పష్టం చేశారు.

సైనిక చర్యలు నిలిపివేస్తున్నప్పటికీ ఇరాన్ పై ఆర్థిక, నావికా నిర్బంధనం పూర్తి స్థాయిలో కొనసాగుతుందని వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు రవాణా మార్గమైన హార్ముజ్ జలసంధి ద్వారా రికార్డు స్థాయిలో చమురు రవాణా అవుతోందని అన్నారు. నిన్న ఒక్కరోజు రాత్రి 2.2 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు హార్ముజ్ ద్వారా ఇతర దేశాలకు సప్లై అయ్యిందని, అందులో ఒక్క బ్యారెల్ కూడా ఇరాన్ సరిహద్దుల్లోకి వెళ్లడం కానీ, అక్కడ నుండి బయటకు వెళ్లడం కానీ జరగలేదన్నారు. ఇరాన్ వైపు ఒక్క బొట్టు చమురు కూడా వెళ్లకుండా సైన్యం అడ్డుకుందని అన్నారు.

# స్థానిక ఎన్నికలకు సుప్రీం గ్రీన్ సిగ్నల్!



**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం విచారించి, దానిని కొట్టివేసింది. ఈ తాజా తీర్పుతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అయింది.

ఓటర్ల జాబితాపై ధర్మాసనం స్పష్టత

రాష్ట్రంలో ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, లేక పాత జాబితాతోనైనా స్థానిక ఎన్నికలను యథావిధిగా నిర్వహించుకోవచ్చని పిటిషనర్ తరఫు న్యాయవాదికి సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. ఇందులో ఎలాంటి సందేహాలు అవసరం లేదని స్పష్టం చేసింది. ఇక రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా ముగిసిన తర్వాతే ఎన్నికలు జరపాలన్న వైసీపీ వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేయాలని కోరడం కేవలం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరాన్ని న్యాయస్థానం పరోక్షంగా సమర్థించింది.

# భూమికి భగభగలు.. ఎల్ నినో సెగలు!

మొదటి పేజీ తరువాయి

WMO అంచనా ప్రకారం అక్టోబర్ -నవంబర్-డిసెంబర్ కాలంలో ఎల్ నినోకు కేంద్రంగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా సుమారు 3.7 డిగ్రీల వరకు అధికంగా ఉండే అవకాశం ఉంది.

వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మాయే ప్రపంచ ఉష్ణోగ్రతలకు సంబంధించిన ప్రపంచ మ్యాప్‌ను సోషల్ మీడివయాలో షేర్ చేశారు. "భూమి దాదాపు మొత్తం ఎర్రగా ఉంది" అని కామెంట్ చేశారు. ఎల్ నినో చలికాలం వరకు గరిష్ట స్థాయికి చేరుకోవచ్చని, అమెరికా మినహా అనేక ప్రాంతాల్లో భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరో వాతావరణ నిపుణుడు లియోన్ సైమన్స్ పసిఫిక్ ప్రాంతంలో 3.4 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదలను "సూపర్ డూపర్ ఎల్ నినో"గా అభివర్ణించారు.

పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడాన్ని "ఎల్ నినో"గా వ్యవహరిస్తారు. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా వర్షాల్లో అసమానతలు చోటుచేసుకుంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఏర్పడితే, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు ముప్పు పెరుగొచ్చు. ఈ ఎల్ నినో 2024 ఫిబ్రవరి వరకు కొనసాగొచ్చని అంచనా వేస్తున్నారు.

# నానా పటేకర్ మృతిపై విచారణ!




**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** ప్రముఖ సీనియర్ నటుడు నానా పటేకర్ మృతికి సంబంధించి గోవా పోలీసులు అసహజ మరణం కింద మెడికో-లీగల్ కేసు నమోదు చేశారు. అసలు ఆయన ఎలా చనిపోయారు? మరణానికి గల సరియైన కారణాలేంటి? అనే విషయాలను తెలుసుకోవడానికి ప్రస్తుతం విచారణ కొనసాగుతున్నట్లు ఓ జాతీయ మీడియా సంస్థ తెలిపింది. దీనిూా సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసిన పోలీసులు, పనాజీకి చెందిన పీఎస్ఐ నితిన్ నాయక్‌కు ఈ విచారణ బాధ్యతలను అప్పగించారు. దోనా పౌలాలోని 'ఓషన్ పార్క్' నుంచి నానా పటేకర్‌ను అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకువచ్చే సరికి ఆయన ఇప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు కేసులో పేర్కొన్నారు. వార్త తెలిసిన వెంటనే బాంబోలిమ్‌లోని మణిపాల్ ఆస్పత్రిని సందర్శించిన పోలీసులు, అక్కడ మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు.

ఈ విచారణలో భాగంగా నానా పటేకర్ మరణానికి గల అసలు కారణాన్ని తెలుసుకునేందుకు పోలీసులు పోస్టుమార్టం నివేదికను పరిశీలించడంతో పాటు, కుటుంబ సభ్యులు, ఇతరుల నుంచి వాంగ్మూలాలను సేకరించనున్నారు. ఒకవేళ ఈ విచారణలో ఆయనది సహజ మరణమేనని తేలితే కేసును ముగించే అవకాశం ఉంది. అలా కాకుండా ఏమైనా అనుమానాస్పద పరిస్థితులు ఉన్నట్లు తేలితే మాత్రం తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. గురువారం ఉదయం మీడియాకు వివరాలు వెల్లడించిన మణిపాల్ ఆస్పత్రి ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శేఖర్ సాల్కర్, తమ వైద్యుల బృందం ఆయనను కాపాడటానికి శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ ఆస్పత్రికి తీసుకువచ్చే సమయానికే ఆయన కన్నుమూశారని, దాంతో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి వచ్చిందని చెప్పారు. ఆయనకు గుండెపోటు వచ్చిందని, అయితే దానికి గల కచ్చితమైన కారణం తెలియనప్పటికీ, అంతకుముందే ఆయన గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ మందులు వాడుతున్నట్లు తమకు తెలిసిందని డాక్టర్ వెల్లడించారు. అనంతరం భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోవా మెడికల్ కాలేజీకి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

# భారత పైలట్‌కు ఇజ్రాయెల్ గౌరవం!




**న్యూస్ డెస్క్, 09 అక్టోబర్ (బిఎన్ఎస్):** భారత పైలెట్ స్మిత్ మచ్చర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఫ్లై దుబాయ్ విమానంలో తన ప్రాణాలను లెక్కించేయకుండా కోపైలెట్‌తో పోరాడి 174మంది ప్రాణాలను కాపాడినందుకు గానూ ఇజ్రాయెల్ ప్రభుత్వం అరుదైన గౌరవం ప్రకటించింది. ఆ దేశ అత్యన్నత పౌర సాహస పురస్కారాన్ని మచ్చర్‌కు అందించనున్నట్టు ఆ దేశ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ వెల్లడించారు. మచ్చర్ కోలుకున్న తరవాత స్వయంగా పురస్కారాన్ని అందజేస్తామని చెప్పారు. ఇక ఇప్పటికే కోపైలట్‌ను సాహసోపేతంగా పట్టుకున్న ఆరుగురు ఇజ్రాయెల్ పౌరులకు సైతం హెర్జోగ్ పౌర సాహస పురస్కారాలను అందించారు. తాలి మేనెస్, జ్వికా మేనెస్, యానివ్ హయూన్, డాక్టర్ షోటా మూసాయేవ్, అసఫ్ రాజువాన్, ఓర్ పార్డిలోవ్‌లను జెరూసలేంలోని అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. మచ్చర్ కోలుకున్నత తరవాత ఆయనకు ఇజ్రాయెల్ పౌర సాహస పురస్కారం అందించనున్నారు.

# ప్రియదర్శిని బాలవిహారులో ఘనంగా జరిగిన లేఖా రచన, స్టాంపుల ప్రదర్శన

కొత్తపేట(బిఎన్ఎస్)అక్టోబర్ 9 : అక్టోబర్ 9వ తేదీ ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని మొబైళ్ళకు బానిసలవుతున్న నేటితరం పిల్లలలో ఉత్తరాలు రాసే అలవాటును పెంపొందిద్దామనే ఉద్దేశంతో స్థానిక ప్రియదర్శిని బాలవిహార్ యజమాన్యం తల్లిదండ్రులకు, పిల్లలకు ఇచ్చిన పిలుపు మేరకు దాదాపు 60 మంది పిల్లలు బంధువులకు ఉత్తరాలు రాసే కార్యక్రమానికి ఎంతో ఉత్సాహంగా హాజరయ్యారు. పిల్లలు వారి అమ్మమ్మలకు, నాయనమ్మలకు, తాతయ్యలకు, ఇతర బంధువులకు ఎంతో ఉత్సాహంతో ఉత్తరాలు రాయడమే కాకుండా ఉపాధ్యాయుల సహకారంతో అందరూ స్థానిక తపాలా కార్యాలయానికి వెళ్లి ఎంత ఉత్సాహంతో పోస్ట్ బాక్స్ లో వేశారు. ఈ తరం పిల్లలకు ఇది ఒక కొత్త అనుభూతి అనీ ఈ కార్యక్రమం ద్వారా నేటి తరం పిల్లలలో దశాబ్దాల క్రితం నాటి ఉత్తరాల సంస్కృతీ పునరుద్ధరణకు పునాదులు వేసినట్టయిందని స్కూల్ అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య అన్నారు.

తమ స్కూలు పిల్లలు మాత్రమే కాకుండా దేశంలోని పిల్లలందరూ కొన్ని ప్రత్యేక సందర్భాలలో బంధుమిత్రులకు ఉత్తరాలు రాయడం అలవాటు చేసుకోవడం నేటి తరానికి చాలా అవసరం అని కరస్పాండెంట్ ఫిలాటలిస్ట్ అద్దంకి బుద్ధ చంద్ర దేవ్ అన్నారు.

నిన్నటి వరకు పిల్లలకు ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు. రేపటినుండి దసరా సెలవులు. ఇట్లాంటి పరిస్థితుల్లో మధ్యలో ఈరోజు ప్రపంచ తపాలా దినోత్సవం, రేపు భారత జాతీయ తపాలా దినోత్సవం, ఈనెల 9 నుండి 15వ తేదీ వరకు తపాలా వారోత్సవాలు. అన్నింటినీ పురస్కరించుకుని ఈ రోజును చిన్నారులకు ఉత్తరాలు ఎలా రాయాలో నేర్పడానికి, తపాలా వ్యవస్థ పట్ల, స్టాంపుల పట్ల, వాటి సేకరణ పట్ల ఒక ప్రత్యేకమైన అవగాహన కల్పించడానికి వినియోగించామని దేవ్ అన్నారు. ఐదు దశాబ్దాలుగా తాను సేకరించిన వివిధ తపాలా బిళ్ళలను ప్రదర్శనగా ఉంచి వాటిని గురించి పిల్లలకు ప్రత్యేకంగా వివరించారు. 1921లో రాయబడ్డ పోస్ట్ కార్డు, చార్లెస్ దయానా కుటుంబ కలర్ ఫోటోతో ఇంగ్లాండ్ లో విడుదలైన ఒకప్పటి పోస్ట్ కార్డు,



స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు విడుదలైన అనేక స్టాంపుల వివరాలతో తపాలా శాఖ ముద్రించిన పుస్తకాలు, కొన్ని ప్రత్యేక స్టాంపులతో పాటు విడుదల చేసిన ఫస్ట్ డే కవర్స్, హిస్టరీ బ్రోచర్స్ అనేకం ఈ ప్రదర్శనలో చోటుచేసుకున్నాయి.

మధ్యాహ్నం నిర్వహించిన సభా కార్యక్రమంలో ఉత్తరాలు రాసిన పిల్లలు, బ్లాక్ బోర్డును డెకరేట్ చేసిన పిల్లలు, స్టాంప్స్ ప్రదర్శనలో పాల్గొన్న పిల్లలు అందరూ ముక్తకంఠంతో తాము మొబైల్స్ కు, టీవీలకు ఎడిక్ట్ కామని ఇలా ఉపయోగపడే పనులతోనూ, డైరీలో తీసుకున్న హోంవర్కులు చేస్తూను దసరా సెలవులను సద్వినియోగం చేసుకుంటామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సోషల్ టీచర్ ఏ ఎస్ ఆర్ మూర్తి, మ్యాథ్స్ టీచర్ ఇరగవరపు ఇందు భార్గవి, తెలుగు పండిట్ బూసి నాని కుమారి, బయాలజీ టీచర్ కే అనూష ఇతర ఉపాధ్యాయినులు, పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా 'ప్రజా దర్బార్'



## : వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ఉమ్మడి నెల్లూరు జిల్లావెంకటగిరి(బి.యన్.యస్):– ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధలను తప్పించడమే ధ్యేయంగా స్థానిక శాసనసభ్యులు శ్రీ కురుగొండ్ల రామకృష్ణతన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులను వెంకటగిరి యంల్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకి స్వయంగా విన్నవించుకున్నారు.అర్జీలను స్వయంగా స్వీకరించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు తమ చిన్న చిన్న పనుల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి ఉండకూడదు. ప్రజల వద్దకే పాలన, వారి సమస్యలకు తక్షణ పరిష్కారం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. అర్జీ ఇచ్చిన వెంటనే సంబంధిత పని పూర్తి కావాలి. ఒకవేళ నిబంధనల ప్రకారం ఏదైనా పని చేయలేని పరిస్థితి ఉంటే, ఎందుకు చేయలేకపోతున్నామో స్పష్టమైన కారణం వివరిస్తూ అర్జీదారునికి లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తాం అని స్పష్టం చేశారు.అదేవిధంగా ప్రతి శుక్రవారం 'ప్రజా దర్బార్' (సమస్యల సత్వర పరిష్కారం)ప్రతి సోమవారం'గ్రీవెన్స్' (ప్రజల నుంచి వినతుల స్వీకరణ) నియోజకవర్గ ప్రజలందరూ ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# నిహారికను అభినందించిన ఐటీ శాఖ మంత్రి లోకేష్.



ఉమెన్ ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ మాస్టర్ టైటిల్ సాధించిన చల్లా నిహారికను ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. రాష్ట్రానికి చెందిన యువ చెస్ క్రీడాకారిణి చల్లా నిహారిక కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఫిడే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను దక్కించుకున్న నిహారికను ఎందరో యువత ఆదర్శంగా తీసుకోవాలని, చెస్ క్రీడపై ఆసక్తి పెంపొందించుకోవాలని మంత్రి నారా లోకేష్ అన్నారు. కృషి పట్టుదలతో ఆడపిల్లలను ముందుకు నడిపిస్తున్న నిహారిక తల్లిదండ్రులను మంత్రి అభినందించారు. ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఉమెన్ గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా నిహారిక వివరించారు. ఇందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# పేకాట స్థావరం పై పోలీసుల దాడి...

## నలుగురి అరెస్ట్, రూ.16,135 నగదు స్వాధీనం



నెల్లూరు జిల్లా(బి.యన్.యస్):–నెల్లూరు జిల్లాలోనిరాపూరు మండల పరిధిలోని గోనుపల్లి అటవీ ప్రాంతంలో జరుగుతున్న జూద స్థావరంపై రాపూరు పోలీసులు దాడి చేసి, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. యస్.ఐ. జె.తిరుమల రావు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం గోనుపల్లి అడవి ప్రాంతంలో జూదం ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు, వారి వద్ద నుంచి రూ.16,135/- నగదును స్వాధీనం చేసుకున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

# రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న సిఈసి రాజీనామా చేయాలి..!!




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 09: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగ విరుద్ధంగా, బిజెపికి అనుకూలంగా, దేశంలో పౌరులను రెండుగా విభజించి, ఓటు ఉన్న పౌరులు , ఓటు లేని పౌరులుగా వేరు చేయడాన్ని, ఎస్.ఐ.ఆర్. సర్వేలోని ఫారం -6 లో పెట్టిన రాజ్యాంగ విరుద్ధ నిబంధనలను రద్దు చేయాలని,

ప్రజాస్వామికంగా వ్యవహరించిన సీఈసీ రాజీనామా చేయాలని, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా, కడప జిల్లా... జమ్మలమడుగు అంబేద్కర్ విగ్రహం వద్ద డివైఎఫ్ఐ కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్త చేశారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి రాజీనామా చేయాలని ఆందోళనలో భాగంగా జమ్మలమడుగు లో నిరసన జరుగుతోందని తెలిపారు. అక్టోబర్ 10 న డిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమం మరియు విజయవాడ లోక్ భవన్ ముట్టడిలో విద్యార్థులు, యువకులు, మేధావులు, ప్రజాస్వామ్య వాదులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని శివకుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సుబహాన్, అరుణ్, పట్టణ ఉపాధ్యక్షులు సురేంద్ర, సభ్యులు కృష్ణా రెడ్డి తది,తరులు పాల్గొన్నారు.

# సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళల భద్రతకు బాధ్యత వహించాలి..!!

## మహిళలపై నేరాల నివారణ, బాలల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన ముద్దనూరు సిఐ.నగేష్ బాబు..

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 09: కడప జిల్లా.. ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్, ఐపిఎస్. ఆదేశాల మేరకు, ముద్దనూరు సిఐ. నగేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాజు గురువాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలపై నేరాల నివారణ, మహిళలు మరియు బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలపై వేధింపులు, హింసను అరికట్టడం, మహిళల భద్రత, బాలల హక్కుల పరిరక్షణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలను వివరించారు. మహిళలను గౌరవించడం, బాలికల హక్కులను పరిరక్షించడం, సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళల



భద్రతకు బాధ్యత వహించడం వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఎవరైనా ఆకతాయికుల వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, సైబర్ నేరాల బారిన పడకుండా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమాచారం తెల్పాలనుకున్నచో హెల్ప్‌లైన్ నంబర్లు

112 పోలీసు సహా అత్యవసర సేవలు.

181 మహిళల హెల్ప్‌లైన్.

1098 బాలల హెల్ప్‌లైన్.

1930 సైబర్ ఆర్థిక మోసాల ఫిర్యాదుల కోసం. అత్యవసర పరిస్థితుల్లో ఈ హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకొని సకాలంలో సహాయం పొందాలని విద్యార్థులకు సూచించారు. మహిళలు, బాలికలు లేదా చిన్నారులు వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.

మహిళలు, బాలికలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ సమిష్టిగా బాధ్యత వహించాలని, నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

### సౌర విద్యుత్ వినియోగంతో

# విద్యుత్ బిల్లులకు చెక్

## పీఎం సూర్య ఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన




నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):–కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ సోలార్ పథకంపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు రాపూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో సేవా సేతు అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గూడూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాపూరు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ప్రభుత్వ సబ్సిడీలు, సౌర విద్యుత్ ప్రయోజనాల గురించి వివరించారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రూ.78 వేల వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవచ్చని వివరించారు. నెట్ మీటరింగ్ పనితీరు, విద్యుత్ ఆదా, బ్యాంకు రుణాల సదుపాయాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా రాపూరు విద్యుత్ ఉపకేంద్రం వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి, డిస్కం ఆమోదించిన విక్రేతల ద్వారా సోలార్ ప్యానెళ్ల నమూనాలను ప్రదర్శించారు. ఆసక్తి కలిగిన వినియోగదారులకు అక్కడికక్కడే స్పాట్ రిజిస్ట్రేషన్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఏడీ సురేష్, రాపూరు ఏఈ గోపి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 11న నృత్య మహోత్సవ్ 2026



కాకినాడ (బీఎన్ఎస్)అక్టోబర్ 9: ఈనెల 11వ తేదీన కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో దసరా నృత్య మహోత్సవ్ పేరుతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు నిర్విరామ నృత్య ప్రదర్శన జరుగుతుందని మృత్యాంజలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఫౌండర్, డైరెక్టర్ హరి లోకేష్ శర్మ, కృష్ణవేణి, ఫెస్టివల్ డైరెక్టర్ హరి గురు శరవణ్ తెలిపారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించాలని కోరుతూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)కు ఆయన స్వగృహంలో ఆహ్వాన పత్రికను అందించారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమై నిర్విరామ నృత్యం కొనసాగుతూ సాయంత్రం 8 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. ఈ సభలో 25 మందికి శక్తి పురస్కారాలు అందిస్తామని ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాలను సుమారు 200 మంది పైగా హాజరవుతారని చెప్పారు. కాకినాడలో ఇది రెండవసారి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హరి లోకేష్, కృష్ణవేణిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై వీక్షించాలని గురు శరవన్ తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు సాత్విక సత్యవాడ, తటవర్తి అనూష తదితరులు పాల్గొన్నారు.

### రాపూరు ప్రభుత్వ ఆసుపత్రిలో

# ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్




నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్):– నెల్లూరు జిల్లా రాపూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ అర్షియా ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాపూరు ఎంపీడీవో వసుంధరమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ప్రభుత్వ అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడం వంటి అంశాల ప్రాముఖ్యతను తెలియజేశారు.

ప్రజలు ఆరోగ్యంపై తగిన శ్రద్ధ వహిస్తూ, ప్రభుత్వ ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించడంలో వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా సేవా సంకల్ప్ అభియాన్ లక్ష్యాలను ప్రజలకు వివరించి, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు కృషి చేశారు. గర్భిణీలకు పోషకాహారం అందించారు.కార్యక్రమంలో డాక్టర్ గజరా వేణుగోపాల్,భూపతి జై రామయ్య, డాక్టర్లు, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు దసరా ఉత్సవాల కమిటీ ద్వారా ఆహ్వానం అందుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 09: కడప జిల్లా.. ప్రొద్దుటూరు పట్టణంలో అత్యంత వైభవంగా, ఘనంగా జరగనున్న శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల కు కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డిని ఆర్యవైశ్య సభ ప్రతినిధులు ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు ఆర్యవైశ్య సభ కమిటీ నాయకులు ఎంపీ అవినాష్ ను నేరుగా కలసి శాలువాతో సత్కరించి, దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఆహ్వానించిన నాయకులలో ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ మల్లెంకొండు ప్రతాప్, కమిటీ సభ్యులు మల్లేముల సత్యం, బచ్చు పవన్ తది,తరులు పాల్గొన్నారు.

ఆహ్వానాన్ని స్వీకరించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రొద్దుటూరులో జరగబోయే దసరా ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు మరియు ఏర్పాట్ల గురించి కమిటీ సభ్యులను ఆరా తీశారు. ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలకు ప్రత్యేక ప్రాశస్త్యం ఉందన్న ఎంపీ, ఈ వేడుకలకు ఖచ్చితంగా హాజరవుతానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు.

# బోయినపల్లి పీజీ హాస్టళ్లలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**హాస్టళ్లలో విస్తృత తనిఖీలు నిర్వహించిన పోలీసులు..**

**విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచన..**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 09: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపిఎస్. ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారు ఝామున మన్నూరు సీఐ. ఎస్. లింగప్ప ఆధ్వర్యంలో మన్నూరు పోలీస్ స్టేషన్, సిబ్బంది కలిసి బోయినపల్లి లోని పీజీ హాస్టళ్లలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలోని గదులు, నివాస సౌకర్యాలు, పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో, స్థానికులతో మాట్లాడి ఎలాంటి నేరాలకు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నూరు సీఐ ఎస్.లింగప్ప మాట్లాడుతూ... హాస్టళ్లలో మరియు గదుల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, విద్యార్థులు గొడవలకు దిగరాదని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో పుట్టినరోజులు లేదా ఇతర కార్యక్రమాల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని విద్యార్థులకు స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాలకు లొంగి అసాంఘిక శక్తుల వెంట తిరిగి భవిష్యత్తు పాడు చేసుకోవద్దని సిఐ లింగప్ప యువత కు సూచించారు. ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఇంద్రకీలాద్రి

విజయవాడ బిఎన్ఎస్,సెప్టెంబర్ 9 : సృష్టి స్థితిలయ గారిని గా పేరుపొందిన ప్రముఖ క్షేత్రాలలో విజయవాడ ఇంద్రకీలాద్రి పైవలసి ఉన్న దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబోతున్నారు.పుణ్యభూమిగా ప్రసిద్ధిగాంచిన భారతదేశంలోని ప్రధాన శక్తిక్షేత్రాలలో విజయవాడలోని ఇంద్రకీలాద్రి క్షేత్రము విశిష్టమైనది, మహిమాన్వితమైనది. పరమపావన కృష్ణానదీతీరంలో ఇంద్రకీలాద్రి మీద శ్రీ కనకదుర్గాదేవి, శ్రీ మల్లేశ్వరస్వామివారు స్వయంగా అవతరించటం విశేషమని చరిత్ర చెబుతోంది. ఇంద్రకీలాద్రిపై ఉన్న ప్రతి శిలను పవిత్రంగా, ప్రతి వృక్షాన్ని కల్పవృక్షంగా భక్తులు భావిస్తారు. వేదమంత్రాలతో, స్తోత్రాలతో భక్తులుగావించే శ్రీ దుర్గామల్లేశ్వరుల దివ్యనామస్మరణలతో ఇంద్రకీలాద్రిక్షేత్రం అపరకైలాసంగా భక్తులు కొలుస్తున్నారు.

ఈ

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మగా అమ్మవారి అవతరణ.

జగన్మాత మహిమను తెలుసుకున్న కీలుడనే యక్షుడు ఘోరతపస్సు చేయగా, అతని భక్తికి మెచ్చి శ్రీ అమ్మవారు ప్రత్యక్షమై వరాన్ని కోరుకోమనగా, 'పరాశక్తి అయిన మీరు నా హృదయంలో శాశ్వతంగా కొలువై ఉండాలని' వరం అడుగగా శ్రీఅమ్మవారు కీలునితో నీవు అద్రి(కొండ) రూపంలో ఉండమని త్వరలోనే ఈ అద్రిపై స్వయంభువుగా ఆవిర్భవిస్తానని వరమిచ్చి అనుగ్రహించింది. కీలుడు ఆనందభరితుడై అద్రిగామారగా, కొంతకాలానికి దుర్గమాసురుడిని వధించిన ఆదిపరాశక్తి కీలాద్రికి వచ్చి దుర్గాదేవిగా వెలసింది. విజయవాడనగరమును పరిపాలిస్తున్న మాధవవర్మ ధర్మనిరతికి మెచ్చిన దుర్గాదేవి కనకవర్షం కురిపించి, శ్రీ కనకదుర్గాదేవిగా కీర్తించబడుచున్నది. జగన్మాత దుర్గమ్మ ధరణిపై వెలసిన భూమి కావటంతో, స్వయంగా ఇంద్రుడు, దేవతలు, అమ్మవారిని దర్శించుకోవడంతో,ఈ పర్వతం ఆనాటి నుండి ఇంద్రకీలాద్రిగా ప్రాచుర్యాన్ని పొందింది.

శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆవిర్భావం

శ్రీ అమ్మవారు కొలువైన ఈ దివ్యమైనక్షేత్రంలో అర్జునునికి పాశుపతాస్త్రాన్ని అనుగ్రహించి పరమేశ్వరుడు శ్రీ మల్లేశ్వరస్వామిగా అవతరించి భక్తులకు కరుణను అనుగ్రహిస్తున్నారు. ద్వాపరయుగంలో అర్జునుడు వనవాససమయంలో శ్రీకృష్ణభగవానుని ఆజ్ఞమేరకు శ్రీ దుర్గా అమ్మవారిని కొలిచి శ్రీఅమ్మవారి యొక్క అనుగ్రహాన్ని పొంది, శ్రీఅమ్మవారి ఆజ్ఞ మేరకు పరమేశ్వరుని అనుగ్రహముతో పాశుపతాస్త్రాన్ని కోరుటకు ఇంద్రకీలాద్రిపై తపస్సుగావించాడు. అర్జునుడి భుజబలాన్ని, మనోధైర్యాన్ని వాక్ వైఖరిని పరీక్షించాలని సతీసమేతంగా పరమేశ్వరుడు కిరాతుని రూపాన్ని ధరించి అర్జునునితో వాదించి, మల్లయుద్ధం చేశారు. అర్జునుడి శక్తికి సంతసించి శివుడు అలసిపోయి నిజరూపంలో దర్శనం ఇచ్చి పాశుపతాస్త్రాన్ని ప్రసాదించినట్లు శివపురాణంలో చెప్పబడి ఉంది.




ఆంజనేయస్వామిగా క్షేత్రపాలకులు.

ప్రపంచంలో ఎక్కడా కనిపించని విశేషం ఈ ఆలయానికి ఉంది.

ఇంద్రకీలాద్రిపై వెలసి ఉన్న, దుర్గా మల్లేశ్వర ల క్షేత్రానికి.రుద్రాంశసంభూతుడైన శ్రీఅభయాంజనేయస్వామి క్షేత్రపాలకుడుగా ఉన్నారు. దుర్గమ్మ గర్భాలయంలో ఎదురుగా సింహం, సింహము వెనుక భాగంలో ధ్వజస్తంభం, ధ్వజస్తంభానికి వెనుక భాగంలో ఆంజనేయస్వామి, కొలువై ఉండటం కారణంగా సృష్టి స్థితి లయ , జగన్మాత దగ్గర నుంచే ప్రారంభమవుతుందని, భక్తుల నమ్మకం. అదే క్రమంలో కొండ దిగువ ప్రాంతంలో కూడా పెద్ద మర్రి చెట్టు కింద అభయాంజనేయ స్వామి దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ముందు తానే దర్శనమిచ్చి, భూతప్రేత పిచాచాల బారి నుంచి కాపాడుతాడని విశ్వాసం.

శాంతస్వరూపిణిగా తీర్చిదిద్దిన శంకరులు.

దుర్గాసూరుడు అనే రాక్షసుడిని సంహరించిన అనంతరం దుర్గాదేవి ఉగ్రరూపం లో ఉండేదని, ఆ రూపాన్ని చూసిన భక్తులు భయపడే వారిని, ఉగ్రరూప దారిని అయిన దుర్గమ్మను శాంతరోపదారినిగా శంకరులు మార్చినట్లుగా మనకి దేవి పురాణంలో చెప్పబడి ఉంది. ఉగ్రరూపాన్ని ఉచ్చరిస్తూ అమ్మవారికి ఇష్టమైన ఎర్రటి కుంకుమతో అర్చన చేసి, మూలమంత్రాలతో శ్రీ చక్రంలో ద్విగుణీకృతం చేసినట్లుగా, నాటి నుంచి నేటి వరకు అమ్మవారి శ్రీ చక్రం పైన గర్భగుడిలో ఎర్రటి కుంకుమతో రోజు కుంకుమార్చన చేయటం విశేషంగా వస్తోంది. అమ్మవారిని పూజించి, అమ్మవారికి ఇష్టమైన కుంకుమార్చనల ద్వారా భక్తులు సంతోషపెడతారని శంకరులు అమ్మవారికి చెప్పినట్లు. కుంకుమ పూజల ద్వారా అమ్మవారి శాంతపడి భక్తులకు ఇష్టమైన కోరికలు తీరుస్తుందని పురాణాలు చెప్తాయి.

దాని కారణంగానే అమ్మవారికి అత్యంత ఇష్టమైన ఎర్రటి కుంకుమతో భక్తులు పూజలు చేస్తే అమ్మవారు అంత శాంత స్వరూపిణిగా మారి కరుణాకటాక్షాలతో కోరికలు తీరుస్తుంది అన్న ఇతిహాసాన్ని పరిగణలోకి తీసుకొని, దుర్గ గుడి పైన దసరా శరన్నవరాత్రు ఉత్సవాల్లో విశేషంగా కుంకుమ పూజలు నిర్వహిస్తారు. లక్ష కుంకుమార్చనలు నిత్యం ఇక్కడ జరగడం ఆనవాయితీ. నిత్య కళ్యాణం పచ్చ తోరణంల కుంకుమార్చనలతో ఇంద్రకీలాద్రి దసరా సవరణ నవరాత్రి ఉత్సవాల్లో కొత్త శోభన సంతరించుకుంటుంది.

ప్రపంచంలోని నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి ఈ కుంకుమార్చనలో పాల్గొటం విశేషం.

జగద్గురు శ్రీఆదిశంకరాచార్యుల వారు దుర్గమ్మను భక్తులపాలిట కల్పవల్లిగా, శాంతస్వరూపిణిగా ఉంచాలని భావించి శ్రీఅమ్మవారి పాదాలచెంత శ్రీచక్ర ప్రతిష్ఠాపనచేసి వైదికపరమైన స్తోత్రాలతో శ్రీసూక్త విధానంలో కుంకుమతో పూజలు నిర్దేశం చేయగా, ఆనాటి నుండి శ్రీఅమ్మవారికి శ్రీ ఆదిశంకరులు నిర్దేశం ప్రకారం అవిచ్ఛిన్నంగా పూజలు నిర్వహించబడుచున్నాయి. తరతరాలుగా ఇంద్రకీలాద్రి క్షేత్రంపై ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు శరన్నవరాత్రులు శ్రీఅమ్మవారికి అత్యంత వైభవంగా నిర్వహించబడుతున్నాయి.

శ్రీనివాస్ తాతినేని.

స్థానిక సమరానికి

# రాజంపేట జనసేన సన్నద్ధం...!!

**100 శాతం స్ట్రైక్ రేటే లక్ష్యం.. రాజంపేట విజయం అధినేతకు కానుక.**

**స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించిన పవన్ కళ్యాణ్‌కు యల్లటూరు ప్రత్యేక కృతజ్ఞతలు.**



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 09: స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తగా తనకు కీలక బాధ్యతలను మొదటి స్థానంగా అప్పగించిన జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ సమన్వయకర్తల్లో తనకు ప్రాధాన్యత కల్పించిన అధినేతకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ విజయమే లక్ష్యంగా సమష్టి కృషితో ముందుకు సాగుతామని యల్లటూరు శ్రీనివాసరాజు ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలకు చేరువవుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేటుతో విజయాలు సాధించి ఆ విజయాలను పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు కానుకగా అందిస్తామని స్పష్టం చేశారు. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంలో రాజంపేట పార్లమెంట్ సమన్వయ కమిటీలోని తోటి సమన్వయకర్తలు, నిర్వాహక దళ సభ్యుల సపోర్ట్, టీమ్ లోని జనసేన నాయకుల సహకారం ఎంతో కీలకమని పేర్కొంటూ వారందరికీ యల్లటూరు శ్రీనివాసరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరి సమన్వయం, ఐక్యత, కృషితో స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజంపేటలో జనసేన పార్టీ విజయ పతాకాన్ని ఎగురవేస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# సమాచారం ఇవ్వడంలో నల్లగొండ ప్రథమం

**జిల్లా కలెక్టర్ కు రాష్ట్ర స్థాయి అవార్డ్**




నల్లగొండ (బిఎన్ఎస్): సమాచార హక్కు చట్టం అమలులో భాగంగా నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1) బి కింద సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనిపించినందుకు గాను నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఆ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్ల చేతులమీదుగా అవార్డుతో పాటు, జ్ఞాపికను అందుకున్నారు... ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు , పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, సహాయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ల కృషి వల్లనే జిల్లాకు అవార్డు వచ్చిందని కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.. అలాగే సమాచార హక్కు చట్టం కింద కేసులను పరిష్కరించడంలో కూడా నల్గొండ జిల్లా రాష్ట్రంలో 2 వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అధికారులందరూ ఇంకా బాగా పని చేస్తే కేసుల పరిష్కారంలో మొదటి స్థానంలో నిలుస్తామని, ఆ విధంగా అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ కు సమాచార హక్కు చట్టం అమలు లో ఉత్తమ కలెక్టర్ గా రాష్ట్రస్థాయి అవార్డు రావడం పట్ల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సమాచార హక్కు చట్టం అసోసియేషన్లు, ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సాధికారత దిశగా అడుగులు: స్విస్ లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం








హైదరాబాద్: ఆధునిక సమాజ నిర్మాణంలో, దేశ సమగ్ర వికాసంలో బాలికల పాత్ర అత్యంత కీలకమైనది. బాలికల హక్కుల పరిరక్షణ, విద్య, ఆరోగ్య భద్రతతో పాటు సామాజికంగా వారికి సముచిత స్థానం కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో హైదరాబాద్‌లోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ లో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీమతి రమవిశ్వనాధన్ మరియు ఉపాధ్యాయ బృందం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

స్విస్ పాఠశాల కేవలం ఆధునిక విద్యా బోధనకు మాత్రమే పరిమితం కాకుండా, విలువల పునాదులపై పాఠశాలను తీర్చిదిద్దుతూ భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తోంది. విద్యార్థుల్లో చదువుతో పాటు నైతిక విలువలు, జాతీయ భావం, ప్రాచీన జీవన విధానం పట్ల గౌరవం పెంపొందించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తున్నప్పటికీ, మన మూలాలను మరియు సాంప్రదాయ కళలను మరచిపోకుండా విద్యార్థులకు ఆచరణాత్మకంగా బోధిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోంది.

పాఠశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమం కూడా మన సాంస్కృతిక వైభవాన్ని, వీరనారీమణుల త్యాగాలను స్మరించుకునేలా రూపుదిద్దుకుంటుంది. విద్యార్థులతో నాటికలు, రోల్ ప్లేలు మరియు సాంస్కృతిక ప్రదర్శనలు చేయించడం ద్వారా మన చరిత్రను, సంప్రదాయ విశిష్టతలను వారు స్వయంగా అవగాహన చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సాంకేతికతను మరియు సంస్కృతిని సమతుల్యంగా నేర్పుతూ మన సాంప్రదాయాలను భావితరాలకు అందిస్తోంది.

ఈ వేడుకలకు ప్రముఖ యాంకర్ డాక్టర్ సరస్వతి ప్రదీప్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో ముచ్చటిస్తూ, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి క్రమశిక్షణ, నిరంతర శ్రమ అవసరమని ఉద్బోధించారు. పిల్లలను సరైన మార్గంలో నడిపించడంలో తల్లిదండ్రుల మార్గదర్శకత్వం ఎంతో అమూల్యమైనదని ఈ సందర్భంగా ఆమె నొక్కిచెప్పారు.

ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వినియోగం పెరిగిపోతున్న దృష్ట్యా, విద్యార్థులు దానిని ఎంతవరకు ఉపయోగించాలో స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సరస్వతి ప్రదీప్ సూచించారు. సోషల్ మీడియాను పరిమితంగా, కేవలం విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి మరియు సద్వినియోగ పరచుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని, సమయాన్ని వృథా చేసుకోవద్దని విద్యార్థులకు హితవు పలికారు.

కార్యక్రమంలో భాగంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో వీరోచిత పోరాటం చేసిన ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత చరిత్రను విద్యార్థినులు 'రోల్ ప్లే' రూపంలో ప్రదర్శించి సభను మైమరిపించారు. బాలికల ధైర్యసాహసాలను, సాధికారత ఆవశ్యకతను కళ్లకు కట్టినట్లు చూపించిన ఈ ప్రదర్శన సభలోని వారందరిలో నూతనోత్తేజాన్ని నింపింది.

ఈ వేడుకల్లో పాల్గొన్న పాఠశాల పూర్వ విద్యార్థినులు హరిచందన మరియు కృష్ణవంశిక తమ విద్యాభ్యాస అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకున్నారు. ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు వివిధ రంగాల్లో మహిళా శక్తి సాధించిన విజయాలను వారు వివరించారు. సమాజంలో బాలికా సాధికారత సాధించాలంటే ఆత్మవిశ్వాసం, విద్యే మూలస్తంభాలని తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేశారు.

కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి డాక్టర్ సరస్వతి ప్రదీప్ గారిని పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ శ్రీమతి రమవిశ్వనాధన్ మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ప్రతి ఒక్కరిలో లోక కల్యాణ భావనను నింపేలా నిర్వహించిన శాంతి పాఠంతో ఈ వేడుకలు ప్రశాంతంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.